క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మహబూబాబాద్: పేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో రూ.20,66,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌పాషా, రమేష్, యుగేందర్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా పరశురాములు



మహబూబాబాద్ అర్బన్: బహుజన సమాజ్ పార్టీ కార్మిక విభాగం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మరిపెడ మండలానికి చెందిన ఐనాల పరశురాములును నియమిస్తున్నట్లు బీఎస్పీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ చొల్లేటి మహేష్‌బాబు ఆదివారం తెలిపారు.

హనుమాన్ ఆలయానికి విగ్రహాల వితరణ



మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం గ్రామంలోని భక్తాంజనేయ స్వామి ఆలయానికి శ్రీ సీతారామలక్ష్మణ, హనుమాన్ విగ్రహాలను హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న దాత డాక్టర్ అన్నం నరేష్ ఆదివారం వితరణ చేశాడు. అనంతరం ఆలయంలో శాంతి కల్యాణం, హోమం కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు



గార్ల: గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రూ.10లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రఘుబాబు తెలిపారు. ఆదివారం ఖమ్మంకు వచ్చిన ఎమ్మెల్సీని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సురేష్, నాగేశ్వరరావు, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

బొడ్రాయి శంకుస్థాపన పూజలు



మహబూబాబాద్ రూరల్: శ్రీసీతల పరమేశ్వరి, బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి దేవతల ప్రతిష్ఠాపన భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ సంద ఈరన్న మాట్లాడుతూ.. మే 15, 16, 17, 18 తేదీల్లో ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపాడు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చీరిక వేణురెడ్డి, ముత్యాల వెంకన్న, ఎల్లయ్య, కృష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న తునికి పండ్లు



మహబూబాబాద్ అర్బన్: ప్రతి రోజు మార్కెట్‌లో రసాయనాలతో పండించిన పండ్లను తింటున్నారు. ప్రజలు కచ్చితంగా సహజ సిద్ధంగా పండిన పండ్లను ఇష్టపడుతుంటారు. అడవిలో దొరికే తునికి పండు జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జిలో ఆదివారం అమ్ముతున్నారు. ఈ పండ్లకు బాగా గిరాకీ ఉంది. అయితే ఈ తునికి పండ్లను తినడానికి ప్రజలు ఎంత ధరకైన వెనకాడడం లేదు. ప్రస్తుతం తునికి పండ్లు ఒక డబ్బుకు రూ.50 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. సహజ సిద్ధమైన రుచిగా ఉండడంతో ప్రజలు ఎంత ధరైన కొనుగోలు చేస్తున్నారు.

ఆదాయంపై ఆర్టీసీ నజర్

- నష్టాలను భర్తీ చేసేందుకు 'ఆర్టీసీ వంద రోజుల టార్గెట్' కార్యక్రమం
- ఈనెల 23నుంచి జూన్ 30 వరకు..
- ప్రత్యేక ప్రణాళికతో ముందుకు..

నెహ్రూసెంటర్: ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకునేందుకు గానూ 'ఆర్టీసీ వంద రోజుల టార్గెట్' కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా స్పేర్ బస్సులు మినహా అన్ని బస్సులతో ప్రతి రోజు ప్రత్యేకంగా ఆదాయం పొందేందుకు ప్రణాళికలు తయారు చేశారు. మహబూబాబాద్ డిపో రూ. 6కోట్ల 14 లక్షల నష్టాల్లో ఉండగా ఈనెల 23వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆర్టీసీ వంద రోజుల టార్గెట్ కార్యక్రమాన్ని చేపట్టి నష్టాలకు చెక్‌పెట్టే విధంగా ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ముమ్మరంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ టార్గెట్‌లో భాగంగా ఉద్యోగులు అత్యవసర సమయాల్లో తప్ప సెలవులు తీసుకోవద్దని ఆదేశాలు అందాయని అధికారులు చెబుతున్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రతిరోజు 25వేల కిలోమీటర్లు బస్సులు తిప్పాలని, ప్రతి కిలోమీటర్‌కు రూ.46వచ్చేలా చూడాలని అధికారులు చెప్పినట్లు తెలుస్తుంది. గతంతో సైతం ఆర్టీసీ వంద రోజుల టార్గెట్ కార్యక్రమాన్ని నిర్వహించగా మంచి ఫలితాలు రాగా మరోమారు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



మహబూబాబాద్ ఆర్టీసీ డిపో

బస్సుల వివరాలు..

ఎక్స్‌ప్రెస్	12
పల్లె వెలుగు	44
మినీ పల్లెవెలుగు	08
స్పేర్ బస్సులు	06

వంద రోజుల టార్గెట్‌ను సాధించాలి



ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన టార్గెట్ ను రీచ్ కావాలి. డిపో నష్టాల నుంచి లాభాల్లోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఉద్యోగులందరూ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలి.

– విజయ్, డిపో మేనేజర్, మహబూబాబాద్

ఆర్టీసీ వంద రోజుల లక్ష్యాలు..

- ప్రతి ట్రిప్పులో కనీసం నలుగురు లేదా ఆరుగురు ప్రయాణికులు అదనంగా ఎక్కేలా డ్రైవర్లు, కండక్టర్లు చొరవ చూపాలి.
- ఎక్కువ మంది ప్రయాణికులు ఉన్న చోట రెండు నిమిషాల పాటు బస్సు ఆపి వారిని ఎక్కించుకోవాలి.
- ప్రయాణికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు మూడో షిప్టు పంపాలి.
- అవకాశం ఉన్న చోటికి టార్గెట్‌కు మించి కిలోమీటర్లు తిప్పాలి.
- వేసవిలో మధ్యాహ్నం సమయంలో నడిచే బస్సులను ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో తిప్పాలి.
- అద్దె బస్సులను కూడా అదనపు ట్రిప్పులకు వినియోగించాలి
- పరీక్షల అనంతరం గ్రామాలకు తిరిగే బస్సుల్లో ఆక్యుపెన్సీ తక్కువగా ఉన్న సర్వీసులను గుర్తించి రద్దు చేసి రద్దీగా ఉండే ప్రాంతాలకు మళ్లించాలి.

ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి మున్సిపాలిటీ రూపు రేఖలు మారాయని సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు విడుదల చేశారని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వార్డులోని స్నేహనగర్‌లో 14 ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15లక్షల వ్యయంతో నిర్మాణం చేసే సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విడుదలైన నిధులతో మానుకోట మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కౌన్సిలర్ జనార్దన్, రాజు, రాజశేఖర్ రంజిత్, మురళి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థుల ఇబ్బందులు



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

చిన్నగూడూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించలేని అసమర్థ పాలకులని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు సంక్షేమ వసతి గృహాలను ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాలకుల వివక్ష, ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం కారణంగా వసతి గృహ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నూతన మండలంగా చిన్నగూడూరు ఏర్పడినప్పటి నుంచి వసతి గృహాలను ఒకటి తహసీల్దార్ కార్యాలయానికి, మరొకటి కస్తూర్బా గాంధీ పాఠశాలకు వాడుకుంటున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కార్యాలయాలు స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి పరశురాములు, నాయకుడు కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బద్దిపోచమ్మ బోనాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు: మండల కేంద్రంలోని పాకాలవాగు ఒడ్డున నిర్మించిన బద్దిపోచమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజతో ప్రారంభించి బద్దిపోచమ్మ విగ్రహానికి పంచామృత అభిషేకములతో గ్రామస్తులు జలాభిషేకం చేశారు. ముందుగా ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి ఇంటి నుంచి మొదటి బోనం రాగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ చైర్మన్‌తో కలిసి అమ్మవారికి మొదటి బోనం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివ, సాగర్, మల్లేష్‌యాదవ్, శివకుమార్, శ్రీను, యుగంధర్, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, ఎంపీటీసీ నూకల రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

డోర్నకల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా డోర్నకల్‌కు చెందిన కత్తెరసాల విద్యాసాగర్ ఆదివారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం ఉన్నారు.

ఆలయ ప్రారంభోత్సవ పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి, ముత్యాలమ్మ ఆలయాల ప్రారంభోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్, సునీత, వ్యాపారవేత్త తవిసి వీరభద్రం, సుజాత దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చల్లమల్ల శ్రీనివాస్‌రెడ్డి, చిన్నవెంకన్న, బోడ్డు వెంకన్న, అల్వాల వెంకన్న, సర్పంచులు సేవ్యనాయక్, వీరమల్లు, ఎంపీటీసీ జ్యోతిరాంమూర్తి పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మరిపెడ మండలం స్టేజితండా గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ రామదాసు జ్ఞాపకార్థకంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వాముల విగ్రహాలు నేడు సోమవారం ప్రతిష్ఠించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కురవి: ప్రారంభిస్తున్న తోట లాలయ్య

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాలో ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆత్మ చైర్మన్ తోటలాలయ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సరితవిజయ్, ఉప సర్పంచ్ భూక్య శోభన్‌బాబు, వార్డు సభ్యులు సుందర్‌లాల్, గణేష్, రవీందర్, వీరన్న, రమేష్, హేమ్లా, వైస్ చైర్మన్ వీరన్న, పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సలీమాతో కలిసి బీఆర్ఎస్ నాయకులు మూల మురళీధర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెక్కల మమత, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు జక్కుల ఐలయ్య, నాయకులు గునిగంటి కృష్ణ, గంగన్న, శ్రీను పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నెహ్రూసెంటర్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో గ్రామస్థాయిలో పని చేస్తున్న ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. ఐకేపీ వీఓఏల జిల్లా కమిటీ సమావేశం వెలిశాల సుధాకర్ అధ్యక్షతన ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వీఓఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం వీఓఏల స్ట్రగుల్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా చింత మౌనిక, కోకన్వీనర్లుగా నానబాల పురుషోత్తం, నీలం కృష్ణవేణి ఎన్నికయ్యారు. సమావేశంలో శ్రీలత, లలిత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

తొర్రూరు రూరల్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న ఆత్మీయ కుటుంబ సమ్మేళనం విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పీఆర్ డెలప్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ ఆదివారం పిలుపునిచ్చారు. సమావేశాల్లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నలమాల ప్రమోద్, గ్రామాల ఇన్‌చార్జ్‌లు దొంగరి శంకర్, సర్పంచ్‌లు శ్రీపాల్‌రెడ్డి, కడెం యాకయ్య, ఎంపీటీసీలు దొనక ఉప్పలయ్య, పల్లె దేవమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి వర్గీకరణ చేపట్టాలని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మనగర్‌లో ఏప్రిల్ 4వ తేదీన ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, జరుగనున్న హైదరాబాద్, విజయవాడ నగరాల ముట్టడి కార్యక్రమ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కోకన్వీనర్ పోలెపాక ప్రవీణ్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షురాలు ఎండీ రజియా, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు చలగోల వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయొద్దు



గుడిసెవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మహబూబాబాద్: ప్రభుత్వ భూములలో పేదలు గుడిసెలు వేసుకుని నష్టపోవద్దని తహసీల్దార్ నాగ భవాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 255లో పేదలు పెద్ద ఎత్తున గుడిసెలు ఏర్పాటు చేసుకోగా ఆదివారం రెవెన్యూ పోలీస్, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుడిసెలను తొలగించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గుడిసెలు వేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిరుపేదలకు ప్రభుత్వమే న్యాయం చేస్తుందన్నారు. గుడిసెలు వేసుకున్న వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందు



మహబూబాబాద్ రూరల్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని మసీదుల్లో సాయంత్రం ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా ప్రత్యేక నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మసీదులన్ని ఇఫ్తార్ విందులతో సందడిగా కనిపిస్తున్నాయి.

మహబూబాబాద్ అర్బన్: రంజాన్ పురస్కరించుకుని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ముస్లిం విద్యార్థులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన నివాళి

కురవి: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి కార్యక్రమాన్ని కురవిలో ఆదివారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయసారథి, నల్లు సుధాకర్‌రెడ్డి, పోగుల శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్, బిక్షపతి, దొంతు రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర వెంకటేశ్వర్లుగౌడ్, నాయకులు యాకాంతంగౌడ్, అజయ్, ఉపేందర్, పెంటయ్య, సోమయ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



దంతాలపల్లి: మండలంలో ఇటీవల కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఆదివారం మండలంలో 1050 ఎకరాలు పరిశీలించగా, 370 ఎకరాలలో దెబ్బతిన్న వివిధ పంటలను గుర్తించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సందీప్, శిరీష, దీక్షిత్, రైతులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

నెహ్రూసెంటర్: దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టాలని పీఓడబ్ల్యూ విముక్తి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాపర్తి లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.సైదులు, చంద్రకళ, భద్రక్క, యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

దంతాలపల్లి: నేడు ఉదయం 10 గంటల నుంచి మరిపెడ తహసీల్దార్ కార్యాలయం దగ్గరలో గల ఆడిటోరియంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్ల తహసీల్దార్ శివాణి ఆదివారం తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారం

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా నీలం సుహాసిని, పాలక మండలి మెంబర్స్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికిగాను ఆదివారం ఏర్పాట్లను చేశారు.

సంక్షిప్త సమాచారం

భూమి పూజ

డోర్నకల్: మండలంలోని కస్నాతండా గ్రామపంచాయతీ శివారు చిమ్నాతండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బానోత్ శంకర్‌నాయక్, సర్పంచ్ బానోత్ రాంబాయి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ అవయవాల పంపిణీ

మరిపెడ: చెన్నైలోని నెట్‌మేడ్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం, మంగళవారం రెండు రోజుల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేతుల మీదుగా కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకుడు ఎడెల్లి పరశురాములు తెలిపాడు.

తప్పుడు విధానాలను మానుకోవాలి

తొర్రూరు రూరల్: రాహుల్‌గాంధీ ఎంపీ పదవిపై బీజేపీ అనర్హత వేటు వేయడం వంటి తప్పుడు విధానాలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. ఆదివారం మండలంలోని అరిపిరాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు.

సన్మానం

డోర్నకల్: డోర్నకల్ ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన నున్నా జనార్దన్‌ను ఆదివారం ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, రైల్వే స్టేషన్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటా భగవద్గీత ప్రచారం

బయ్యారం: మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో ఆదివారం ప్రభోద సేవాసమితి– హిందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇంటింటా భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు కృష్ణవేణి, సభ్యులు రజిత, చిన్మయిదొర, సారయ్య, సారమ్మ, స్వప్న, రేఖ, స్వరూప, లలిత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో కొనసాగుతున్న 65వ శ్రీ సీతారామ కల్యాణ వసంత నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం రాములోరికి విశేష పూజలు నిర్వహించారు.

శంకుస్థాపన

నెల్లికుదురు: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని సర్పంచ్ చీకటి ప్రవీణ్ అన్నారు. మండలంలోని చిన్న ముప్పారంలో ఆదివారం దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కదిర జగన్, పీఏసీఎస్ చైర్మన్ గుండా వెంకన్న, బొమ్మరబోయిన ఎల్లయ్య, చిన్నాల కట్టమల్లు, నామాల మహేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కత్తి వెంకన్న తల్లి ఎల్లమ్మ మృతి చెందింది. ఈ మేరకు ఆదివారం డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తట్టుపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. ఆయన వెంట ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, మట్ట చిన్న సైదులు, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దంతాలపల్లి: మండల కేంద్రంలో జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు మల్లయ్య, రామయ్య, రామచంద్రమూర్తి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.